"నిజమే. కాని ఇందు మహా మొండి: వాళ్ళు చెపితే వింటుందా అని నా అనుమానం."

"వింటే వింటుంది లేదా మళ్ళీ మీరు కూడా అడిగి చూడండి."

అతను వింటున్నాడు.

"అప్పటికీ ఆమె వినకపోతే!"

"ఊఁ"

"పెళ్ళికి ముహూర్తం పెట్టించేసి బలవంతంగా ఆమెను పీటలమీదకు ఈడ్చుకువచ్చి మెడలో తాళికట్టేయండి."

అతను ఆలోచనల్లో పడ్డాడు.

"తాళికట్టగానే ఎలాటి అమ్మాయి అయినా టక్కున లొంగిపోతుంది."

"వెంటనే నోరు మూతబడిపోతుంది. తాళిబొట్టు మహిమ అది. తాళిని కాదన్న స్త్రీ ఈ దేశంలోనే లేదు."

"అంతేనంటావా!"

"అంతేనండి మీరు బలవంతంగా పెళ్ళి చేసేసుకోండి ఇక తిరుగులేదు."

"మీరు రమ్మంటే వస్తుంది పొమ్మంటే పోతుంది. కూర్చోమంటే కూర్చుంటుంది నిలబడమంటే నిలబడుతుంది. మంత్రం వేసినట్టు మత్తు జల్లినట్టు చిత్రంగా మారిపోతుంది" అనిది అంబిక సలహా ఇస్తూ.

కృష్ణమోళి ఆలోచిస్తూ "అయితే నువ్వు చెప్పినటు చెయ్యమంటావా!"

"అలాగే చెయ్యండి. తాళి మెడలో పడితే ఏ ఆడపిల్లయినా మన్నుతిన్న పాములా పడివుంటుంది. ఇక సందేహించకండి" అంటూ చెప్పింది.

కృష్ణమోళికి ఉషారు వచ్చింది.

"అయితే సరే. నీవు చెప్పినట్టే చేస్తాను. లక్ష్మీనారాయణగార్ని, అవిడ్ని రప్పిస్తాను. వాళ్ళు చెప్పినా, నేను అడిగినా కాదు అన్నదో అంతే నువ్వు చెప్పినట్టే బలవంతంగా పెళ్ళిచేసుకుంటాను" అన్నాడు.

"కాని జాగ్రత్త. ఆమె పారిపోకుండా చూడండి పారిపోయిందో!" అంది.

"ఊహుఁ" అన్నాడు.

"ఇందుని పారిపోకుండా నేను చూస్తానుగా నీకు అలాటి భయం ఏం వద్దు" అంటూ చెప్పాడు.

ఆమె నవ్వింది.

"అంతే కదా" అంది.

"అంతే" అన్నాడు.

"పెళ్ళి అయ్యాక ఇద్దరూ కలిసి యింటికి రండి. వచ్చి మావయ్యగార్కి అత్తయ్యగార్కి దణ్ణంపెట్టి వారి ఆశీస్సులు తీసుకోండి" అంటూ చెప్పింది.

"అలాగే" అంటూ నవ్వాడు.

"ఉంటాను" అంటూ ఆమె ఫోన్ పెట్టేసింది.

కృష్ణమోళికి మనసు అంతా తేలికయినట్టు అయింది.

ఉషారుగా అనిపించసాగింది.

మంచంమీద పడుకున్నాడు ఆలోచిస్తూ.

(సశేషం)

# దిష్టిబొమ్మ



కప్పగంతుల మల్లికార్జునరావు

పదవ తరగతి పరీక్ష ఫలితాలను ప్రచురించిన పత్రికలు కొన్నిగంటలు పాతబడ్డాయి. ఫలితాలు వచ్చాయి అన్న వార్త పాతబడింది. కానీ పాపయిన విద్యార్థుల మొహాలలో ఆనందం మాత్రం యింకా పాతబడలేదు.

హోటళ్ళలో టిఫిన్‌లు తిని, కాఫీలు తాగి, సెంటర్లో మిత్రబృందాలు చేరి కబుర్లు చెప్పుకొంటున్నాయి. అలాంటి బృందాలలో వొక బృందంలోని వో విద్యార్థి చేతిలో మాత్రం యింకా ఫలితాలొచ్చిన పేపరు నలుగుతోంది.

ఆ బృందానికి అల్లంత దూరంలో నిలబడి ఓ పదిహేను పదహారేళ్ళ కుర్రాడు వాళ్ళ మాటల్ని వింటున్నాడు.

ఆ కుర్రవాడు ధరించిన పేంటు షర్టు నలిగిపోయి వున్నాయి. అందమైన అతని జుత్తు అర్థరహితంగా అటూ యిటూ పడుతోంది.

'ఆ పేపరు ఒకసారి యిస్తారా? సెంత్ రిజల్ట్సు పేజీ చూసి యిస్తాను' ఆ కుర్రవాడు మిత్రబృందం వద్దకెళ్ళి సీరియస్‌గా అడిగాడు.

'ఏం చూస్తావు? నువ్వు పరీక్ష రాసావా?'

'ఊ....'

'అయితే పరీక్ష ఫలితాలు వచ్చాయని పొద్దుటినుంచి తెలియదా? ఏ నెంబరెంతో చెప్పు. నేను చూస్తాను' పేపరు చేతిలో ఉన్న విద్యార్థి అన్నాడు.

ఆ కుర్రాడు విద్యార్థివైపు తీక్షణంగా వొక్క చూపు చూశాడు. తిరస్కారంగా తలతిప్పి తనదోవన తాను వెళ్ళసాగాడు.

'ఏయ్ మిస్టర్-ఆగు. యిదిగో పేపరు. ఫలితం చూసుకోకుండా అలా వెళ్ళిపోతావేం? పేపర్ యివ్వనన్నానని కోపం వచ్చిందా?'

విద్యార్థియిచ్చిన పేపరును మౌనంగా అందుకొన్నాడా కుర్రవాడు. గబగబా పేపరు విప్పి ఫలితాలు ప్రకటించిన చోటులో కాస్సేపు కళ్ళతో తన నెంబర్ కోసం వెతికాడు.

హఠాత్తుగా అతనికళ్ళు వొక్కక్షణం వెలుగుతో నిండింది. అంతలోనే అతని

కళ్ళల్లో నైరాశ్యం—

'థాంక్స్' పేపరు మడిచి విద్యార్థికి అందిస్తూ అన్నాడు.

"పాసయ్యావా?'

'ఊ....'

'యీ వూరు కానట్లుందే? ఏ వూరు?'

'సారీ....' అంటూ అతను కోపంగా పేపరు చించి ముక్కలు చేశాడు.

విసవిస నడిచి అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

'పాపం. ఫెయిలయి వుంటాడు' అనుకొన్నాడు విద్యార్థి.

*　　*　　*

ఆ కుర్రవాడు మొహంమీద పడుతున్న వెంట్రుకలను పైకి తోసుకొంటూ వడివడిగా నడుస్తున్నాడు.

అందరిలాగా టెంత్‌క్లాస్ అతనూ పాసయ్యాడు. కాని చాలామంది మొహాల్లో వున్న ఆనందం అతని మొహంలో లేదు. కాగా కోపం.

ఆ కుర్రాడిపేరు మార్కండేయులు.

ఆకాశంలో సూర్యుడు నడినెత్తిమీద కొస్తూ నిప్పులు కురిపిస్తున్నాడు.

ఆ వుదయమే మార్కండేయులు అరిగిపోయి, చినిగిపోయిన పాతచెప్పుల్తో తంటాలుపడలేక రోడ్డుపక్కకు విసిరి కొట్టాడు. జేబులో మిగిలిన చిల్లరపైసల్తో కాఫీ తాగాడు.

మార్కండేయులి కాళ్ళు కాలుతున్నాయి. కడుపు కాలుతోంది. గుండె మండుతోంది.

తనూ అందరిలాగా టెంత్ పాసయ్యాడు. కానీ అందరిలాగా సంతోషించే యోగ్యత లేదు. ఆనందంగా మిత్రులతో గడిపే అదృష్టం లేదు.

అందుకు కారణం ఎవరు?

మార్కండేయులికి తన తండ్రి గుర్తుకొచ్చాడు. అతని మొహం అసహ్యంతో, కోపంతో నిండిపోయుంది. కాళ్ళముందు వో రాయి వుంటే దాన్ని ఫుట్‌బాల్‌ని తన్నినట్లు బలంగా తన్నాడు—కోపంతో.


రాయి అంగుళం కూడా కదల్లేదు. కానీ అతని వేలు చిట్లి రక్తం కారింది. అయినా అతను 'అమ్మా' అని బాధపడలేదు. అటూ యిటూ చూచి వో చిత్తు కాగితం ఏరి దానితో రక్తం తుడిచాడు. రోడ్డుమీద మన్ను పోగుచేసి చిట్లిన వేలుపై చల్లేడు. మంటపుట్టింది వేలు.

అమ్మ గుర్తుకొచ్చింది. చెల్లెలు, తమ్ముడు గుర్తుకొచ్చారు.

చల్లటి గుర్తులు. బాధ తగ్గినట్లనిపించింది.

అమ్మ తనకోసం దిగులుపడుతుంటుంది. పోనీ అమ్మకోసమన్నా యింటికి వెళ్తే?






అంతలోనే తండ్రి రూపం, దాష్టీకం, అథారిటీ....

చావనన్నా చస్తాను. కానీ తిరిగి వెళ్ళను. నాకేం? నేను టెంత్ పాసయ్యాను. ఎలాగైనా బతకగలను. ఎవరైనా పనిస్తారు.

ఆ ఆలోచన వచ్చిన క్షణంలోనే అతను తలతిప్పి రోడ్డుపక్కన వున్న షాపును చూశాడు.

అయితే ఆ షాపు యజమాని కొంతసేపుగా తననే శ్రద్ధగా గమనిస్తున్నట్లు మార్కండేయులికి తెలియదు.

అతను ఆ షాపులోకి ప్రవేశించాడు.

అది ఒక హోమియో మెడికల్‌షాప్.

*　　*　　*

మార్కండేయులు తన షాపులోకే రావటాన్ని చూచిన ఆ షాపు యజమాని దత్తాత్రేయశర్మ చేతిలో పేపర్ని విప్పి ఆఖరిసారిగా చూచాడు.

"నాయనా మార్కండేయులూ.

నువ్వు యిల్లు విడిచి పారిపోయిన దగ్గరినుంచి మీఅమ్మ బెంగతో మంచం ఎక్కింది. నీ తమ్ముడు, నీ చెల్లెలు నిన్నే కలవరిస్తున్నారు. నువ్వు ఎక్కడవున్నా వెంటనే యింటికి తిరిగి రావల్సింది. పదోతరగతి పరీక్ష ఫెయిలయినా నిన్ను ఏమీ అనను. నీ యిష్టానికి వ్యతిరేకంగా ఏదీ జరగదు. తిరిగివచ్చేందుకు నీ దగ్గర డబ్బులేకపోతే ఎక్కడ వున్నదీ తెలియజేస్తే నేను వచ్చి తీసుకొనివెళ్తాను. నీరాక కోసం మేమంతా ఎదురుచూస్తున్నాంరా నాయనా మార్కండేయా. ఆహార పానీయాలు సహించటం లేదు. వెంటనే వస్తావుకదూ?

ఇట్లు
నీ తల్లి, తండ్రి, సోదరీసోదరులు.

గమనిక: యీ ప్రకటనలో ప్రచురించబడ్డ ఫోటోలో వున్న మార్కండేయులు యొక్క ఆచూకీ తెలిపినవారికి తగు బహుమతి యివ్వబడును.

ప్రకటనకు పైభాగంలో మార్కండేయులు బొమ్మ, క్రిందిభాగంలో తండ్రి చిరునామా యివ్వబడింది.

దత్తాత్రేయ శర్మ ప్రకటనను చదివి, తలెత్తి లోపలికొస్తున్న మార్కండేయుల్ని చూస్తూ పేపరు మడిచి అవతల పెట్టేడు.

'ఎవరు బాబూ నువ్వు? ఏం కావాలి?'

'పనికావాలి. మీ షాపులో పనేమైనా యిస్తారేమోనని అడగటానికి వచ్చాను'.

'కూర్చో. ఏం పని చెయ్యగలవు నువ్వు?'

'నేను టెంతుక్లాస్ పాసయ్యానండీ. ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాను.'

దత్తాత్రేయశర్మ ఆప్యాయంగా నవ్వాడు.

'చాలా సంతోషం నాయనా. కానీ నే నడిగింది నువ్వేం చదివేవు అనికాదు. ఏంపని చేయగలవని?'

'ఏపనైనా చెయ్యగలనండీ. నాకు బుద్ధి బలమేకాదు, భుజబలం కూడా వుంది'.

'భేష్ భేష్. నాకు నువ్వు నచ్చావు. అ-ముందు ఫలహారం ఏదైనా తెప్పిస్తాను. తిను. ఆతర్వాత పనిసంగతి ఆలోచిద్దాం. అన్నట్లు.... ఎండాకాలం. కాళ్లకి చెప్పుల్లేకుండా తిరుగుతున్నావా? అనారోగ్యం కదూ? అరెరె.... ఆ గాయం ఏమిటి? వేలికి ఎదురురాయి కొట్టుకున్నదా? గాయంపైన అలా దుమ్ము చల్లవచ్చా? గాయం మానాలంటే మందు తీసుకోవద్దూ?' అంటూ దత్తాత్రేయశర్మ షాపులోని వో వ్యక్తిని పిలిచాడు.

'సుబ్బారావ్ యితని గాయం సెప్టిక్ కాకుండా వో డోస్ మందివ్వు ముందు. ఆ తర్వాత బజారు వెళ్ళి తినటానికి ఫలహారం, అతని కాలిసైజుకు సరిపడే వో కాలిజోడు కొనుక్కురా?

దత్తాత్రేయశర్మ సుబ్బారావుకు పురమాయింపులు చేసి మార్కండేయులు వైపు తిరిగేడు.

'షాపులో పనేంలేదోయ్, నీకు మా యింట్లో పని యిస్తాను. భోజనం, ఫలహారం, బస యివన్నీ మా యింట్లోనే. యివన్నీకాక నీకు జీతం ఎంత కావాలో అడుగు__'

మార్కండేయులు కళ్లల్లో వొక్కసారిగా నీరు చిమ్మింది.

'అయ్యొయ్యో! అదేమిటి నాయనా? నీ మనసుకు కష్టం కలిగించే మాటేమైనా అన్నానా? యింట్లో పనిచేయటం నీ కిష్టం లేకపోతే....'

'అదేం కాదండీ, మానాన్న గుర్తుకొచ్చాడు' అన్నాడు అతను వెక్కి వెక్కి ఏడుస్తూ

*      *      *

"పెద్దమ్మగారూ, పెదనాన్నగారితో నేనో విషయం చెప్పాలనుకుంటున్నాను. కానీ భయంగా వుంది. మీరు నాకు తోడుగా వుండరూ?"

దత్తాత్రేయ శర్మగారింటికి వచ్చిన రోజుల్లోనే మాయింటి సభ్యులలో తనూ వొకడుగా కల్సిపోయాడు మార్కండేయులు. తమ బిడ్డలలో వొక బిడ్డగానే చూచుకొనేది మహాలక్ష్మమ్మ.

నిజానికి ఆ యింట్లో చేయటానికి మార్కండేయులకి పనేంలేదు. ఎవరి పనులు వారు చేసుకోటానికి ఆ యింట్లో అంతా అలవాటుపడ్డారు. ఎవరి కంచం వారు కడుక్కొంటారు. ఎవరి బట్టలు వారు వుతుక్కొంటారు. అది న్యూనతగా భావించరు.

'నాకు పనేమీలేదు అమ్మగారూ.... ఊరికే తిని కూర్చోటం నాకు బాగాలేదు. మీరేమన్నా పని చెప్పండి'.

మహాలక్ష్మమ్మ ప్రసన్నంగా నవ్వింది.

'పనిచెయ్యకపోతే నీ తప్పు, పనిలేకపోతే ఎవరితప్పు కాదు. నీ తమ్ముడికి, చెల్లెలికి చదువు చెప్పరాదు? భారత రామాయణాలు నువ్వు చదివి వాటి సారాంశం నాకు చెప్పరాదూ? రెక్కల కష్టం చేస్తేనే పనిచేసినట్లు కాదుగదా?'

తమ్ముడు! చెల్లెలు!

తన తమ్ముడు, చెల్లెలు గుర్తుకొచ్చారు మార్కండేయులికి.

మహాలక్ష్మమ్మగారి కొడుకు, కూతురికి పాఠాలుచెప్తుంటే తన తమ్ముడు చెల్లెలుకు పాఠం చెప్తున్న తృప్తి!

'చూడు మార్కండేయా, నువ్వు నన్ను 'అమ్మగారూ' అని పిలవకు. 'పెద్దమ్మా' అని పిలు! పెదనాన్నగారూ అని పిలువు ఆయన్ని. మా యింట్లో యజమానికి సేవక భావనలకు స్థానం లేదు. మనుష్యుల్ని సంస్కారవంతుల్నిగా తీర్చిదిద్దేది. మానవతా బంధం మాత్రమే అని ఆయన అంటుంటారు.

అలా కొద్దికొద్దిగా ఆ యింటిలో వొకడయ్యాడు. కుటుంబంలో కల్సిపోయాడు. అతని మొహంలోకి ఏదో కళ వచ్చింది. అయితే అప్పుడప్పుడూ హఠాత్తుగా స్తబ్ధత్వంకి వెళ్ళేవాడు.

'ఏమిటి మార్కండేయా అలాగున్నావేమిటి? మీ నాన్నగారు గుర్తుకొచ్చారా? చనిపోయిన వారిని గురించే స్మరించుకొని ఏంలాభం చెప్పు?'

తన తండ్రి చనిపోయాడని, తనకెవ్వరూ లేరని ముందే చెప్పేడు అతను. ఆ విషయాన్ని గురించి తన గతజీవితాన్ని గురించి వాళ్లేమైనా తరచితరచి ప్రశ్నిస్తారేమోనని మొదట్లో భయపడ్డాడు. ఆ తర్వాత వాళ్లు అడిగితే బాగుండునని

కొన్నాడు. కాఫీ అడిగిందే?

దత్తాత్రేయశర్మ యింట్లో వుండేదే స్వల్పకాలం. ఆ కాలంలో స్నాన సంధ్యలు, అనుష్ఠానం, పుస్తక పఠనం, యింకా కాలం మిగిలితే పదుగురితో నాలుగు మంచిమాటలు మాట్లాడటానికే సరిపోతుంది.

ఆయనంటే యింట్లో అందరికీ గౌరవం. ఆయన మహాళ్ళాని చిల్లరమల్లర సమస్యలన్నీ మహాలక్ష్మమ్మ చూచుకో వల్సిందే.

'దానికేం భాగ్యం? కానీ పెదనాన్నగారితో చెప్పవల్సినంత విషయం ఏముంది? యింట్లో నీకు సౌకర్యంగా లేదా? డబ్బు కావాలా? అలాంటి విషయాలేమైనా అయితే నాతో చెప్పవచ్చు కదా?

'అలాంటిదేం కాదు పెద్దమ్మగారూ. నాకు యీ యింట్లో సౌకర్యాంకేం కొదవ? తల్లిదండ్రులవద్ద నున్నప్పుడుకూడా నేను ఇంత ఆనందాన్ని పొందలేదు. నేను పెదనాన్నగారికి, మీకు తెలిగ్గా చెప్పాలను కొంటున్న విషయం చాలా ముఖ్యమైనది.

'అలాగా?'

'అవును. అదొక కథ'

'అయితే ఆ కథను రాత్రికే చెప్పు. నేను పెదనాన్నగారితో మాట్లాడుతానులే'

* * *

'అనగా అనగా వో వూళ్ళో వో కుర్రవాడు. అతనికో తల్లి, తండ్రి వున్నారు. తల్లి మంచిది. తండ్రికికూడా కొడుకుపైన ప్రేమ వుంది.

కానీ తండ్రి చండశాసనుడు. అందరూ తన అభీష్టం ప్రకారం నడుచుకోవాలనే తత్వం కలవాడు. అలా ఎవరైనా నడుచుకోకపోతే ఆయనకు కోపం వస్తుంది. కేకలేస్తాడు. కొడుకు నయితే కొట్టేవాడు కూడా.

ఆ కుర్రవాడికి చిన్నప్పటినుంచి ఎన్నెన్నో స్వంత ఆలోచనలుండేవి. స్వంత అభిరుచులుండేవి. కానీ తండ్రి అతని ఆలోచనల్ని పెరగనివ్వలేదు. అభిరుచుల్ని చంపేశాడు.

ఏరోజు ఏంకూర తినాలన్నది కూడా తండ్రే చెప్పేవాడు ఎప్పుడు నిద్ర పోలాల్సింది, ఎప్పుడు లేవల్సింది, ఏ సమయంలో ఆడాలో, ఎప్పుడు ఏం చదవాలో కూడా తండ్రే నిర్దేశించేవాడు.

తండ్రి తనవిషయాలన్నింటినీ అలా నియంత్రించటం కుర్రాడికి ఏమాత్రం నచ్చేది కాదు వొకటి రెండు సార్లు నియమాలను కావాలని నుల్లంఘించాడు. తండ్రి విధించిన శిక్షల్ని అనుభవించాడు.

క్రమంగా అతనొక విషయాన్ని గుర్తించాడు.

నియమాలకు లొంగి స్తబ్ధంగా పడివుండేకన్నా, వాటిని నుల్లంఘించటంలో వొకవిధమైన సంతృప్తి, వెర్రి ఆనందం వుంది.

రాత్రి ఏడున్నరకల్లా భోజనంచేసి, తొమ్మిదిన్నర వరకు చదువుకొని నిద్ర పోవాలన్నది తండ్రి విధించిన నియమం. అతను ఆరింటికే అమ్మనడిగి అన్నం పెట్టించుకొని తినేవాడు. ఏడున్నరనుంచి తొమ్మిదిన్నర వరకు పుస్తకాలు ముందేసుకు కూర్చునేవాడు. కానీ చదివే వాడు కాదు. తొమ్మిదిన్నర తర్వాత బెడ్ లైటు వెల్తురులో తండ్రి నిషేధించిన పుస్తకాలను చదివేవాడు.

వయస్సుతోపాటు క్రమంగా ఆ కుర్రవాడికి తండ్రి అంటే ద్వేషం, కోపం పెరిగాయి. తండ్రి వద్దన్న పనులన్నీ చేయటం అతనికి సర్దాగా వుండేది. రహస్యంగా అతను చేసిన తప్పుల్ని తెల్సుకొన్నప్పుడు తండ్రి అతడిని శిక్షించేవాడు. అన్నం పెట్టకుండా మాడ్చటం, పేను దెబ్బలు కొట్టటం, ఎండలో నిలబెట్టటం.... అలాంటి శిక్షల్లో కొన్ని.

'యీ శిక్షలకు వడ్డితో కలిపి నిన్ను శిక్షించేరోజు రాకపోదులే. అప్పుడు చూద్దువుగాని నా ప్రతాపం' శిక్షను అనుభవిస్తూ కుర్రవాడు తండ్రి నుద్దేశించి మనసులో అనుకొనేవాడు.

అతనికి పదిహేనేళ్ళు వచ్చాయి. తండ్రి అతనికి మానసికంగా బద్ధశత్రువయ్యాడు. ఆయనమీద పగ పెరిగింది.

యిలా వుండగా ఆ కుర్రాడికి తమ్ముడూ, చెల్లెలు పుట్టేరు. వారంటే అతనికి ఎక్కువలేని ప్రేమ. క్రమశిక్షణ పేరిట వారిని కూడా తండ్రి శిక్షించటాన్ని చూచి సహించలేకపోయేవాడతను. అతనికి తండ్రిని చంపిపారేద్దామన్నంత కోపం వచ్చేది. ఒకటి రెండు సందర్భాలలో తండ్రిని చంపటానికి రహస్యంగా ప్రయత్నాలు చేసేడు కూడా

ఆ కుర్రాడు టెంత్ పరీక్షలు వ్రాశాడు. అతను పరీక్షల నెలా వ్రాసిందీ తండ్రి పరీక్షించాడు. ఆయన ఊహించిన స్థాయిలో రాయలేదని కోపం వచ్చింది. కొట్టాడు.

మనసులో తండ్రిపట్లనున్న ద్వేషం ఆ క్షణంలో పెల్లుబికింది. ఆవేశంగా మారింది. తిరగబడి తండ్రిని కొట్టాడా కుర్రాడు.

అతను కొట్టిన దెబ్బకు తండ్రి నుదిటి నుంచి రక్తం కారింది.

అతనక్కడినుంచి పారిపోయాడు. తిరిగి యింటికివెళ్తే తనకి జరగబోయే దేమిటో అతనికి తెల్సు. అంతేకాదు. మరోసారి అతనికి ఆవేశం పెల్లుబికితే తండ్రిని ఏ రాయిపెట్టి బుర్ర పగలకొట్టి చంపవచ్చు

తనకి తండ్రిని చంపాలన్న కోరిక గాఢంగా వుందని అతను గ్రహించాడు. అక్కడే వుండి తండ్రితో పోరాడి చంపటమా? లేక శాశ్వతంగా యింటినుంచి పారిపోవటమా?

తల్లిని, తమ్ముడు చెల్లెల్ని వదిలి పోవాలని అతనికి లేదు.

అలాగని తండ్రి మొహాన్ని చూస్తూ ద్వేషాన్ని నిగ్రహించుకోవటం సాధ్యం కాదు.

అందుచేత అతను ఇల్లు విడిచి పారిపోయాడు.

కొన్నాళ్ళకు అతని ధైర్యం పట్టుదలలు నీరుకారిపోయాయి. కష్టాలు.... కష్టాలు.... అయినా అతనికి ఇంటికివెళ్ళి తండ్రికి లొంగి గడిపేకన్న ఆత్మహత్య చేసుకోవటం మంచిదనిపించింది.

ఆ ఆలోచనలో వుండగా పదోక్లాసు పరీక్షఫలితాలు తెలిశాయి. తండ్రి ఊహించిన విధంగా స్టేట్‌ఫస్ట్ రేంక్‌హోల్డర్ కాలేదు. తను అనుకొన్నట్లు థర్డ్‌క్లాప్‌లో పాస్ కాలేదు. ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాడు.

ఇంటికి తిరిగిరమ్మంటూ తండ్రి చేసిన ప్రకటన కూడా పత్రికలలో అతను అప్పుడే చూచాడు. అయినా తండ్రిమీద అసహ్యం ద్వేషం అతడిని యింటికి పోనివ్వలేదు.

భగవత్ స్వరూపుడైన వో వ్యక్తి అతనికి ఆశ్రయ మిచ్చాడు.

అయినా తను కోల్పోయిందేమిటో అతనికి ప్రతిక్షణం గుర్తుకొస్తూ అనుక్షణం గుర్తు చేస్తూనే వుంది.

మార్కండేయులు కథ చెప్పటం ఆపేడు. వొక్కక్షణం నిశ్శబ్దం.

'అంటే — ఆ కుర్రవాడికి తండ్రి మీద కక్ష యింకా పెరుగుతూనే వుందన్నమాట!'

'అవును. తండ్రిని మొహం మీద పిడికిలితో గుద్దాలని, కత్తులతో గుండెల్లో పొడవాలనీ....'

'ఆ కుర్రవాడు చాలా పొరపాటు చేస్తున్నాడు మార్కండేయులూ. నేరుగా తండ్రి వద్దకెళ్ళి గుండెల్లో పొడిచేస్తే సరిపోతుందా?'

'హత్య చేయ్యటం తప్పుకదూ?'

'తప్పే. కానీ మనసులో కక్షను పెంచుకుని కుమిలిపోవడం అంతకన్నా తప్పుకదా?'

మార్కండేయులు మాట్లాడ్డలేదు.

'యింతకీ ఆ కథలో కుర్రవాడు ఎవరని అడగరే సార్? ఆ కుర్రవాడిని నేనే....'

• • •

'మార్కండేయులూ, యిదిగో మీ నాన్న. నీకు కోపం వచ్చినప్పుడు ఆయన్ని కొట్టు, తిట్టు, పొడువు. ఇదిగో కత్తి'.





దత్తాత్రేయశర్మ చేతిలో వున్న బొమ్మవైపు చూచాడతను. తను చెప్పిన తండ్రి పోలికలకు అనుగుణంగా వుంది. తండ్రిని చూస్తున్న భావనే కలిగింది అతనికి.

దత్తాత్రేయశర్మ కేసెట్ వొకదాన్ని టేప్ రికార్డర్‌లో నుంచి స్విచ్ నొక్కాడు.

'బుద్ధిలేని వెధవ. పందిలా తింటున్నావ్. గాడిదలా తిరుగుతున్నావ్. కానీ మనిషి చేయవల్సిన పనులు ఏం చేస్తున్నావ్? మనిషికి క్రమశిక్షణ వుండాలి. కట్టుబాట్లు వుండాలి. అచ్చోసిన అంబోతులా తిరిగితే సరిపోతుందా? తాట వలిచేస్తాను ఏమను కొన్నావో?'

స్విచ్ 'ఆఫ్' చేసేడు.

'అచ్చం మా నాన్నగారి గొంతులాగే వుందండీ. ఆయన యిలాగే తిడ్తాడు'.

'మరింకేం? ఆయన చేత, యీ కేసెట్‌ను ఆన్‌చేసి తిట్టించుకో, నీ కోపాన్ని పెంచుకో. ఆ బొమ్మను నీ తండ్రి అనుకో. ప్రతీకారం తీర్చుకో. క్రమంగా అది దిష్టిబొమ్మ అన్న విషయాన్ని నువ్వే మరచిపోతావ్'

మార్కండేయులు మౌనం వహించాడు.

* * *

దిష్టిబొమ్మను చూచినప్పుడల్లా తండ్రి గుర్తుకొచ్చేవాడు మార్కండేయులికి. అది గుడ్డలతో చేసిన పెద్ద దిష్టిబొమ్మ అన్న విషయాన్ని మర్చిపోయేవాడు. తండ్రిని యిష్టం వచ్చినట్లు తిట్టేవాడు. ఆయన కొడుతున్నట్లుగా ఊహించుకొని తిరిగి కొట్టేవాడు. 'చంపుతాను' అని బెదిరించి రహస్యంగా కత్తితో పొడిచేవాడు.

అలా ఎన్ని సార్లో! ఎన్ని రోజులో!

కొట్టి కొట్టి అలసిపోయాడు. దిష్టి బొమ్మ తూట్లుపడి పోయింది.

'నాన్నా మార్కండేయా, నాపైన నీకింక కసి తీరలేదా? బాగా కొట్టురా రోజూ, తిరిక్కి పడ్డాడు. ఎత్తిన చెయ్యి అలాగే వుండిపోయింది.

కేసెట్ పెట్టుకున్నాడు.

తండ్రి తిట్లలో కొత్త అర్థాలు.

'మార్కండేయా నిన్ను క్రమశిక్షణలో పెంచాలనుకొన్నది నా కోసం అనుకుంటున్నావా బాబూ! నీ కోసమే. నీ బాగు కోరే. మన కుటుంబం శ్రేయస్సు కోరి. మన భారత దేశ శ్రేయస్సు కోరి నాయనా. మొక్కయి వంగనిది మానయి వొంగుతుందా? క్రమశిక్షణలేని వ్యక్తి ఎలా వున్నతుడవుతాడు? కష్టాలను ఎదుర్కొనగల ధైర్యం ఎలా వస్తుంది? క్రమశిక్షణ లేని అరాచక వాదులున్న కుటుంబం ఏం లెక్కొస్తుంది? క్రమశిక్షణలేని వ్యక్తులతో నిండిన దేశం తుక్కలు చించిన విస్తరి చందం కాదూ? తల్లి తండ్రులు స్వార్థాన్ని కొస్త వదులుకొని బిడ్డల్ని క్రమశిక్షణతో పెంచితే ఆరోగ్యవంతమైన కుటుంబం, శక్తివంతమైన దేశం నిర్మాణం అవుతాయని నా ఆశరా నా తండ్రీ....'


మార్కండేయులు ఆశ్చర్యపోసాగాడు!

* * *

'మీ నాన్నగారూ, అమ్మగారూ, తమ్ముడు, చెల్లెలు అంత నిన్ను చూడటానికి వస్తున్నామని రాసారోయ్ మార్కండేయులూ' యీ పుత్తరం చదువు'.

మార్కండేయులు మొహంలో ఆనందరేఖ తళుక్కుమంది. ఉత్తరం






తీసుకొని చదివేడు. అంతలోనే అతని మొహాన్ని విషాదపు మబ్బు కమ్మేసింది.

'యిదేమిటి సార్! నాన్నగారు మంచం పట్టారా? నేను యింటినుంచి పారిపోయానన్న దిగులుతో కృంగి కృశించి పోయారా? నాకు నమ్మశక్యం కావటంలేదు సార్. అమ్మ కన్నీళ్లు తుడవటానికి నాన్నగారు పత్రికలో ఆ ప్రకటన చేసే దనుకొన్నాను. కానీ తను మంచం ఎక్కి ఆ ప్రకటనలో అమ్మ మంచం పట్టిందని ఎందుకు రాసాడో నాన్న?'

'ఎందుకంటే అమ్మ మంచం ఎక్కిందని రాస్తే, ఆమె మీద ప్రేమతోనైనా తిరిగి వస్తావన్న ఆశతో, తనే మంచం ఎక్కేడని రాస్తే, నువ్వు నమ్మనే నమ్మవు కదా?

'నిజమే సార్. కానీ యిదేమిటి? యీ వుత్తరం చూస్తుంటే మా నాన్నగారితో మీకు మొదట మంచి పరిచయం వున్నట్లు కన్పిస్తున్నదే!

దత్తాత్రేయశర్మ నవ్వాడు—మెల్లగా.

'నువ్వు నా కళ్లబడిన దగ్గరనుంచి ఆయనతో నాకు పరిచయం వుంది. నువ్వు ఆ రోజు కళ్లబడి, నేను ఆయనకి నీ క్షేమ సమాచారం తెలియచెయ్యక పోతే మీ నాన్నగారు యిప్పుడు జీవించి వుండేవారు కాదు. ఇదిగో ఈ వుత్తరాలు కూడా చదువు. విషయం నీకే తెలుస్తుంది.'

ఉత్తరాలన్నీ చదివేక మార్కండేయులు కంటనీరు ప్రవహించ సాగింది.

'నాన్నకు నాపైన యింత ప్రేమ వుందా సార్? ఎంత గుడ్డివాడినయ్యాను. కానీ సార్, నాక్కో సందేహం. మీకు అంతా తెల్సుకదా? తెల్సికూడా దిష్టిబొమ్మ నిచ్చి యింత నాటకం ఎందుకు ఆడేరు సార్? విషయం అంతా మీరు నాకు ఏనాడో చెప్పి వుండవచ్చు కదా? నాన్న వద్దకు నన్ను చేర్చివుండ వచ్చుకదా?'

'సకారణంగానో, అకారణంగానో కొందరిపట్ల ద్వేషం కలగవచ్చు మార్కండేయులూ. కోపం రావచ్చు. ఆ కోపాన్ని ద్వేషాన్ని మనసులోనే నొక్కిపెడ్తే, అవి పెరుగుతాయే కానీ తరగవు. ఎదుటివాడిలోని మంచితనాన్ని, ప్రేమను చూడనివ్వవు. మనిషిలోని మానవత్వానికి, సమాజానికి, ముప్పు వాటిల్లుతుంది. కోపాన్ని, పగని, ద్వేషాన్ని పెంచుకొన్న ఆ వ్యక్తి కుటుంబానికి, సమాజానికి, దేశానికి దిష్టి బొమ్మగా మారతాడు. అలా కాకుండా వుండాలంటే కోపాన్ని, ద్వేషాన్ని, పగని ఏదో రూపంలో తీర్చుకోటం అవసరం. అందుకే ఆ 'దిష్టిబొమ్మ నాటకం' ఆడవల్సి వచ్చింది నేను.

'నాకెంతో మేలు చేసేరు సార్. మా నాన్న దిష్టిబొమ్మను అన్నిసార్లు చంపి వుండకపోతే నాన్నను చంపాలన్న నా పగ చల్లారేది కాదేమో। ఆయన కాఠిన్యం వెనుకగల అనురాగతత్వం యిప్పటికి నేను అర్థం చేసుకోలేకపోయే వాడినేమో।'

మార్కండేయులు దత్తాత్రేయశర్మ కాళ్లకు నమస్కరించాడు.

'ఫీడా పోయిందిలే మార్కండేయులూ. మీ నాన్న దిష్టిబొమ్మ నీకు పట్టిన దిష్టిని తొలగించింది. నీ మనసుకు పట్టిన మాలిన్యాన్ని కడిగేసి నిర్మలం చేసింది. కానీ యిక ముందెప్పుడూ ద్వేషం అన్న మాలిన్యాన్ని మనసుకు అంటించుకోకు' మార్కండేయుల్ని లేవదీసి గుండెలకు హత్తుకొంటూ అంది సుహాసినమ్మ.

'యింకా అమ్మా? మీ గుండెల్లో చోటుదొరికేక కూడానా?

ఆమె గుండెల్లో తలదూర్చి చిన్న పిల్లాడిలా ఏడుస్తూ మెల్లగా గొణు క్కొన్నాడు మార్కండేయులు.



# నాకు నచ్చిన నా కథ



విద్యా వీచికలు అనుదినం విస్తరిస్తున్నకొద్దీ నూతన తరంలో విజ్ఞాన జిజ్ఞాస బాగా వేళ్లూను కుంటోంది. అలాగే సాహితీ ప్రక్రియలోనూ అనేక వినూతన ప్రయోగాలు పొడసూపుతున్నాయి.

మొదటినించీ నాకు విజ్ఞాన విషయాలపై కథలు రాయాలనే పిపాస మెండు. అలా అనేక కథలు రాసినా, బ్లడ్‌గ్రూప్స్‌ను ఆధారం చేసుకుని రాసిన ఈ కథ నన్నే కాదు, 'అపరాధ పరిశోధన' మాస పత్రిక ఫిబ్రవరి–79 సంచికలో ప్రచురింపబడి అశేష పాఠక ప్రియులనూ ఆకట్టుకుంది।

అజీజ్

## రక్త తర్పణం!

"మే ఐ కమిన్ సర్?"

"ఎస్।"

స్ప్రింగ్ డోర్స్ కిర్రుమంటూ తెరుచుకున్నాయి. లోపికి వచ్చింది నర్సు.